క్లుప్తంగా

ఉపాధిహామీ పనుల పరిశీలన

మానవపాడు: మండలంలోని చిన్నపోతుల పాడు, చెన్నిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీఓ రమణరావు పరిశీలించారు. కూలీలకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పనుల సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

గద్వాల క్రైం: మత్తుకు యువత బానిస కావొద్దని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి కవిత అన్నారు. సోమవారం గద్వాల మండలంలోని గోనుపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మన్న, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చీనీ, బత్తాయి తోటలపై అవగాహన

గద్వాల వ్యవసాయం/ధరూరు: ధరూరు మండలం పారుచర్లలో మంగళవారం చీనీ, బత్తాయి తోటల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గద్వాల ఉద్యానశాఖాధికారి శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతు సురేందర్ రెడ్డి సంబంధించిన బత్తాయి తోటలో ఉదయం 10:30 గంటలకు ప్రముఖ శాస్త్రవేత్త సంహిత క్రాప్ కేర్ సీఈఓ గున్నం శ్యాంసుందర్‌రెడ్డి బత్తాయితోటల యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మధ్యప్రదేశ్ సమావేశాలకు బీజేపీ నాయకులు

గద్వాల: మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరిగే బీజేపీ సంస్థాగత సమావేశాలకు నడిగడ్డకు చెందిన ఇద్దరూ నాయకులు సోమవారం తరలి వెళ్లారు. బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రతి నియోజకవర్గం నుంచి ఒకరిని చొప్పున ఎంపిక చేశారు. గద్వాల నుంచి బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి చిత్తారికిరణ్, అలంపూర్ నుంచి రాజోలి లక్ష్మీకాంతరెడ్డిలు ఎంపిక చేయడంతో వారు తరలివెళ్లారు. పది రోజుల పాటు జరిగే పార్టీ సంస్థాగత సమావేశాలతో పాటు, ఈ నెల 27న ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో జరిగే ముఖాముఖి కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు.

బిల్లులు చెల్లించాలి

రాజోళి: ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన బిల్లులు తక్షణమే చెల్లించాలని కేవీపీఎస్ నాయకుడు విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు నాలుగు వారాలుగా బిల్లులు ఇవ్వలేదని తెలిపారు. తక్షణమే బిల్లులు అందించకుంటే పెద్ద ఎత్తున కూలీలతో కలసి నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

మొక్కల పెంపకంపై దృష్టి

మల్దకల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కల పెంపకంపై నిర్వాహకులు దృష్టి సారించాలని ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్, నర్సరీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

అలంపూర్ రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ గోవిందరావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ హరితహారంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసి కార్యాలయానికి పంపాలని సూచించారు. వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్స్ దగ్గర మొక్కలను నాటాలని కోరారు. వర్షాకాలంలో ప్రతి శుక్రవారం డ్రైడేను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రకళ, ఏపీఓ రాజు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో మహరాణి ఆది లక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలపై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా జూలై 2న యువతకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 1వ తేదీలోగా సెల్: 7661899899 నంబర్‌కు మిస్ట్ కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల నృత్యా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ముగ్గురికి జైలు శిక్ష

అలంపూర్ రూరల్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవిత సోమవారం ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. పట్టణంలో మద్యం తాగి పట్టుబడిన 10 మందిని కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు. ఇందులో ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

సుందరీకరణ దిశగా పల్లెలు

- గ్రామాల్లో హరితవనాల ఏర్పాటు
- శ్మశానవాటిక, డంపింగ్‌యార్డుల నిర్మాణాలు



సాసనూలులో నిర్మించిన వైకుంఠధామం



కోదండాపురంలో హరితవనాన్ని తలపిస్తున్న ప్రకృతి వనం

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం పల్లెల ప్రగతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు, పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పల్లె ప్రగతి, హరితహారం వంటి కార్యక్రమాలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటడం, పారిశుద్ధ్య పనులు చేపట్టడం, శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 9వ విడత హరితహారం కోసం విరివిగా మొక్కలు నాటాలనే లక్ష్యంతో ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను విరివిగా పెంచుతున్నారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచిన మొక్కలను గ్రామాలలోని ఇండ్ల ఆవరణంలో, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ప్రతి పంచాయతీలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన రెండు ప్లాస్టిక్ బుట్టల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. దీనిని పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. వీటికి తోడు ప్రతి గ్రామంలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు శ్మశానవాటికలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లోని నర్సరీలలో అన్ని రకాల మొక్కలు నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిదులు సర్వం సిద్ధం చేశారు.

కార్యదర్శులు, సర్పంచ్‌ల పాత్ర కీలకం

ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, డంపింగ్‌యార్డులు, స్మశానవాటికల నిర్మాణం పనులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని నిరంతరం కృషి చేస్తున్నారు. గ్రామాల్లో గతంలో 15 రోజుల పాటు జరిగిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో గ్రామాలలోని పలు సమస్యలను పరిష్కరిస్తూ దాదాపు పల్లెల రూపు రేఖలను మార్చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పల్లెల్లో తమ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం చూపుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు గ్రామాలను ప్రగతి పథంలో ముందుండి నడిపిస్తున్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నాం. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నాం.

– స్వాతి, సర్పంచ్, పుటాన్‌దొడ్డి

అందరి సహకారంతో అభివృద్ధి



గ్రామస్తుల సహకారంతోనే పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డు, శ్మశానవాటిక, నర్సరీలను పంచాయతీలో ఏర్పాటు చేశాం. సర్పంచ్‌ల తోడ్పాటుతో పనులు వేగంగా చేస్తున్నాం. ప్రస్తుతం నర్సరీలో పెంచుతున్న అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తాం.

– రాజేశ్వరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోదండాపురం

పట్టణాల మాదిరి పార్కులు



ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్దపీట వేసింది. గ్రామాల్లో పట్టణాల మాదిరి పల్లెల్లో పార్కులు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ఎంతో మంచి పరిణామం. ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌తో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి సేంద్రీయ ఎరువులను తయారుచేస్తున్నాం.

– నర్సమ్మ, సర్పంచ్, బీచుపల్లి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



కాంగ్రెస్ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అయిజ: మండల కేంద్రంలోని పాత, కొత్త బస్టాండ్ మధ్య నిర్మిస్తున్న పెద్దవాగు బ్రిడ్జి కారణంగా స్థానికులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అయిజ పాత బస్టాండ్ సెంటర్‌లో నాయకులు ధర్నా చేపట్టారు. ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జిని కూల్చడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నా విరమించాలని కోరగా ససేమిర అన్నారు. దీంతో నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, కౌన్సిలర్ గిత్తల దేవరాజు, మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా అధికార ప్రతినిధి మైనర్‌బాబు, డీసీసీ సెక్రెటరీ సాంబశివుడు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మునినాయుడు, నాయకులు దేవేంద్ర, శాలు, ఫిరోజ్, మల్లికార్జున్, అబ్రహాం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాజోళి: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చేనేత శ్రామిక సమితి సభ్యులు వీరేష్, నిషాక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత వస్త్రాలు విక్రయించే చోట పవర్‌లూమ్ విక్రయాలు నిర్వహించడంతో కార్మికుల జీవనం, వారి ఉపాధి ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గి, మాస్టర్ వీవర్లు కార్మికులకు చీరలు నేసే పనిని ఇవ్వడం లేదని, వారికి ఇచ్చిన అడ్వాన్సులు కూడా వెనక్కి అడగటం, మెటీరియల్ కూడా వెనక్కు తీసుకునేందుకు ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. దీనికి పవర్ లూమ్ విక్రయాలే కారణమని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని చేనేత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయి పాఠశాలలో మన ఊరు– మన బడిలో భాగంగా జరుగుతున్న పనులను ఎంపీడీఓ గోవిందరావు పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటగది, ప్రహరీ పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. అలాగే గ్రామ పంచాయతీని, నర్సరీని, అంగన్‌వాడీ పాఠశాలను, శానిటేషన్, వాడిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను నాటే పనులను, ఎన్ఆర్‌ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు.

ఉపాధి సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేయాలి



ఉపాధిహామీ సిబ్బందికి మద్దతుగా నినాదాలు చేస్తున్న కూలీలు, ప్రజలు

అయిజ : ఉపాధిహామీ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలని ఉపాధి కూలీలు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండలంలోని సంకాపురంలో ఉపాధి కూలీలు, గ్రామస్తులు సోమవారం సమావేశం అయ్యారు. 18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ అటు కేంద్రం, ఇటు రాష్ట్రం చేపడుతున్న వివిధ పనులను 18 డిపార్ట్‌మెంట్లను సమన్వయం చేసుకుంటూ ఉద్యోగాలు చేస్తున్న ఉపాధి సిబ్బందికి న్యాయం చేయాలని వారు కోరారు. గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేస్తున్న ఐకేపీ సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేసి ఉపాధిహామీ సిబ్బందికి ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. వారికి మద్దతుగా నినాదాలు చేశారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: దేశ ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రజలకు అందించిన పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. సోమవారం మండలంలోని వేములలో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలు వివరించారు.

ఘనంగా సాహూ మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: రిజర్వేషన్ల పితామహుడు సాహూ మహరాజ్ జయంతిని సోమవారం డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ కూడలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాహూ మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జోగిని వ్యవస్థను నిర్మూలించి, కులాంతర వివాహాలను ప్రోత్సహించి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు సాహూ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉండవెల్లి మండల అధ్యక్షుడు ప్రభుదాస్, శివ, చరణ్, పవన్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలు బిజీబిజీ



ఉమిత్యాలలో పొలం దున్నుతున్న రైతు

కేటీదొడ్డి: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రైతన్నలు పొలం పనుల్లో నిమగ్నమయ్యాయి. వివిధ పనులు చేస్తూ బిజీబిజీగా గడుతున్నారు. సోమవారం గ్రామాల నుంచి రైతులు పొలాల బాట పట్టారు. పత్తి, మొక్కజొన్న తదితర విత్తనాలు వేసే పనులు ముమ్మరంగా చేపట్టారు. మరో వైపు గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా కరిగెట చేస్తున్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన



అలంపూర్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

అలంపూర్: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పట్టణంలో సోమవారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. దేశ ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ప్రధాని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందరికీ సమన్యాయం అందించేందుకు ప్రధాని నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి, ప్రధాన కార్యదర్శి నరేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వల్లాటి శ్రీధర్, రంగస్వామి, మధురవాణి, ఈశ్వరయ్య, వినీత్, కృష్ణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై నిరసన

గద్వాల అర్బన్: ముదిరాజ్ జాతిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని పదవి నుంచి తొలగించాలని తెలుగు ముదిరాజ్ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తాలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వాకిటి సంజీవులు, జనార్దన్, జగదీష్, నర్సింహులు, శ్రీనివాస్, అంజి, హరి, రఘు, మహేష్ తదితరులు ఉన్నారు.

జిల్లా అధికారులకు వినతి

అలంపూర్: ముంపునకు గురైన సంత మార్కెట్ కాలనీవాసులకు స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం జిల్లా అధికారులకు ఆ కాలనీవాసులు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని జిల్లా అధికారులకు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. సమస్యను వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. 2009 సంవత్సరంలో వరదల కారణంగా నష్టపోయామని వివరించారు. నిర్వాసితులకు స్థలాలు కేటాయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమదాసు, జయన్న, అబ్రహం, సత్యాలు, మద్దిలేటి, సంత మార్కెట్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐకు వినతి

అయిజ: అర్హులైన వారందరికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సోమవారం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ఐ మధుకు వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సతీష్ అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాల్లో ప్రభుత్వం విఫమైందన్నారు. కార్పొరేట్ విద్యాలయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన 8624 ప్రభుత్వ పాఠశాలను తిరిగి పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్, గణేష్, అశోక్, రఘువంశీ, నరేష్, తేజ, మహేష్, వెంకటేష్, వంశీ, అనిల్ ఉన్నారు.



ధరూరులో తరగతులను బహిష్కరించడంతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

విద్యా సంస్థల బంద్..

ధరూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను బంద్ చేయించారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పాఠశాలల తరగతులను బహిష్కరించారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అమలులో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ అన్నారు. కార్యక్రమంలో రఘు, నర్సింహులు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి



బీపీ మిషన్లను పంపిణీ చేస్తున్న ప్రసూనరాణి

అలంపూర్ రూరల్: ప్రజల ఆరోగ్య వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని వైద్యాధికారి డాక్టర్ ప్రసూనరాణి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. సోమవారం క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతన డిజిటల్ రిచార్జబుల్ బీపీ మిషన్లను వారు ఏఎన్ఎంలకు పంపిణీ చేశారు. అనంతరం ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్సీడీపై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీపీ మిషన్ ఒక్కసారి రీచార్జ్ చేసుకుంటే 400 మందికి చూడొచ్చన్నారు. గ్రామాలలో 30 ఏళ్లకు పైబడిన వారందరికి ప్రజాప్రతినిధుల సహకారంతో క్యాంపులు ఏర్పాటు చేసి స్క్రీనింగ్ చేసి మందులు అందజేయాలన్నారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందపరచాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శ్యామ్‌సుందర్, ఎన్సీడీ సెల్ సూపర్‌వైజర్ మాక్సూద్, ఆరోగ్య సిబ్బంది డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, లీలమ్మ, నర్సమ్మ, హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లు పంపిణీ చేస్తాం

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. సోమవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చిన్న సైజ్ ఉన్న గుడ్లు, నాణ్యతలేని గుడ్లను తీసుకొని నిబంధనల ప్రకారం సరఫరా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. చెడిపోయిన గుడ్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన గుడ్లు అందిస్తామన్నారు. తనిఖీలో సూపర్‌వైజర్ ఆస్మా, పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సీడీపీఓ

ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల అందజేత



మల్దకల్‌లో ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి

గట్టు: ప్రతి పాఠశాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరచడం కోసం సోమవారం ఎంఈఓ కొండారెడ్డి ఆయా పాఠశాలకు చెందిన హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో వివిధ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం సరఫరా చేసిన నూతన ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థులు, మధ్యాహ్న భోజనం, మార్కులు, పాఠశాలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. మొత్తం 37 పాఠశాలలకు ట్యాబ్‌లను అందజేసినట్లు ఎంఈఓ తెలిపారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి ఎంఈఓ కొండారెడ్డి ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 30 ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు ట్యాబ్‌లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్ ఇవ్వాలని డీటీకి వినతి

అయిజ: ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో పింఛన్ చెల్లించాలని టీఏస్‌జీఆర్‌ఈఏ సంఘం వైస్ ప్రెసిడెంట్ మేరమ్మ ఆధ్వర్యంలో సోమవారం డీటీ వెంకట్రామ్‌కు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీకి అందజేశారు. ప్రతి నెల ఒకటో తేదీన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అలంపూర్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సుభాష్ నాయుడుకు వినతి పత్రం అందించారు. ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఖాసీమ్, ప్రధాన కార్యదర్శి సదానందమూర్తి, కేశవాచారి, మద్దిలేటి, రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటాం

గద్వాల క్రైం: పిడుగుపాటుకు మృతి చెందిన నాగరాజు కుటుంబ సభ్యులను ఆదుకుంటామని జిల్లా చైర్‌పర్సన్ సరిత అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ఓదార్చారు. ధరూర్ మండలం మన్నాపురం గ్రామానికి చెందిన నాగరాజు బతుకు దెరువు కోసం మల్దకల్ మండలంలోని మల్లెందొడ్డి గ్రామంలో గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి పిడుగు పడి మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుడు రంజిత్‌కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.